

బెంగుళూరు ఏసీ బస్సులో టికెట్ ధరపై 10 శాతం తగ్గింపు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బెంగుళూరు ఏసీ బస్సు బేసిక్ టికెట్ ధరపై 10 శాతం రాయితీ ప్రకటిస్తున్నట్లు రీజినల్ మేనేజర్ జ్యోష్న ప్రకటనలో తెలిపారు. ఏసీ స్లీపర్, ఏసీ సీటర్, రాజధాని బస్సులకు వర్తిస్తుందని తెలిపారు. మరిన్ని వివరాలు, రిజర్వేషన్ కోసం వెబ్‌సైట్‌లో గాని, సమీపంలోని రిజర్వేషన్ కౌంటర్ వద్ద టికెట్ బుక్ చేసుకోవచ్చని తెలిపారు.



రైతులకు అందని భరోసా

Your SB A/c *8252 Credited for Rs.6450.00 on 10-02-2025 21:15:53 by NEFT/ PAY AND ACCOUNTS OFF UTR: RBI0422523668327 Avl Bal

ఎకరం 28 గుంటలు ఉన్న రైతు ఖాతాలో జమ అయిన కేవలం రూ.6450 నగదు

- జిల్లాలో ఇంకా పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోని 'రైతు భరోసా'
- ఇప్పటి వరకు మూడు ఎకరాలలోపు ఉన్న వారికే అందిన అరకొర డబ్బులు
- సాగుభూమి ఉన్నా.. అందని సాయం
- కొందరి ఖాతాల్లోనే నగదు జమ
- అయోమయంలో అన్నదాతలు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం గందరగోళంగా మారుతోంది. పథకం పూర్తిస్థాయిలో అమలుకాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి రూ.6వేల చొప్పున ఏడాదికి రెండు సార్లు రైతుభరోసా సహాయం అందిస్తామని ప్రకటించినప్పటికీ అది ఆచరణలో సాధ్యం కావడం లేదు. గత నెల 26న రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డుల కార్యక్రమాలను అట్టహాసంగా ప్రారంభించింది. తొలుత మండలానికి ఒక గ్రామం చొప్పున ఎంపిక చేసి నాలుగు పథకాలను ప్రారంభించింది. రైతు భరోసాకు సంబంధించి ఆయా మండలాల్లో ఒక్కో గ్రామంలో రైతుల ఖాతాలో నగదు జమ చేశారు. వారం రోజుల తర్వాత ఎకరం భూమి ఉన్న రైతుల ఖాతాలో రైతుభరోసా నగదు జమ చేయగా ఇప్పటి వరకు జిల్లాలో మూడు ఎకరాలలోపు భూమి కలిగిన రైతుకు రైతు భరోసా డబ్బులను రైతు ఖాతాలో వేశారు. సంవత్సరానికి ఎకరానికి రూ.12వేలు సాగుకు యోగ్యమయ్యే భూములకే సహాయం అందిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. మొదటి విడతగా ఎకరానికి రూ.6వేలు రైతుల ఖాతాలలో జమ చేస్తుంది. కానీ గత ప్రభుత్వ హయాంలో రూ.5వేల రైతుబంధు సహాయం పొందిన రైతులకు వచ్చిన డబ్బులు కూడా ఇప్పుడు బ్యాంకు ఖాతాలో పడకపోవడంతో రైతులు అయోమయ పరిస్థితుల్లో ఉన్నారు. మాక్లూర్ మండలం వెంకటాపూర్ గ్రామంలో ఒక ఎకరం 28 గుంటలు ఉన్న రైతు ఖాతాలో గత ప్రభుత్వ హయాంలో రూ.8500లకు పైగా రైతుబంధు సహాయం బ్యాంకు ఖాతాలో పడగా ఇప్పుడు ఎకరాకు రూ.6వేల సహాయం ప్రకటించిన కేవలం రూ.6450 రైతుభరోసా సహాయం పడటం గమనార్హం. ఇలా జిల్లాలో ఎంతో మంది రైతులు తాము సాగు చేస్తున్న, రికార్డు ఉన్న భూమికి రావాల్సిన రైతుభరోసా సహాయం తక్కువ మొత్తంలో రావడంతో వారంతా అయోమయ పరిస్థితుల్లో పడ్డారు. గత ప్రభుత్వ హయాంలో వచ్చిన డబ్బులకంటే ఇప్పుడు ఎక్కువ డబ్బులు రావాల్సి ఉండగా అంతకంటే తక్కువ డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతున్నా టెక్నికల్ ప్రాబ్లమ్ వల్ల అలా జరిగిందని అధికారులు జవాబు చెబుతున్నారే తప్ప.. సరైన స్పందన లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ఆందోళనలో రైతులు..

రైతుభరోసా పథకం కింద ఎకరానికి ఏటా రూ.12వేలు రెండు విడతలుగా వేస్తామని ప్రభుత్వం గత నెల 26న అట్టహాసంగా కార్యక్రమాన్ని ప్రారంభించింది. అయితే 20 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ కేవలం మూడు ఎకరాలలోపు రైతుల ఖాతాల్లో మాత్రమే డబ్బులు జమయ్యాయి. మొదట ఎకరం లోపు తర్వాత ఎకరం, ఆ తర్వాత రెండు ఎకరాలలోపు ప్రస్తుతం మూడు ఎకరాలలోపు ఉన్న రైతుల ఖాతాలో డబ్బులు జమ చేస్తున్నారు. తర్వాత నాలుగు ఎకరాలు, ఆ తర్వాత పది ఎకరాలలోపు రైతులకు రైతుభరోసా అందాలంటే మరికొన్ని రోజులు రైతులు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. పది ఎకరాలలోపు రైతులకు రైతుభరోసా సహాయం అందాలంటే రెండు నెలలపైనే సమయం పట్టే అవకాశం ఉంది. ఆలోపు రబీపంట పూర్తయి మళ్లీ ఖరీఫ్ మొదలయ్యే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో ఇప్పటి వరకు మూడు ఎకరాలలోపు భూమి కలిగిన రైతులకు రైతుభరోసా సహాయం వారి బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఆలూర్ మండలంలో 4520 మంది రైతులకు రూ.3కోట్ల 91లక్షల 68వేల 810 రూపాయలు, ఆర్మూర్ మండలంలో 6984 మంది రైతులకు రూ.5కోట్ల 61లక్షల 47వేల 402 రూపాయలు, డొంకేశ్వర్ మండలంలో 2589 మంది రైతులకు రూ.2కోట్ల 12లక్షల 68వేల 827 రూపాయలు, మాక్లూర్ మండలంలో 8791 మంది రైతులకు రూ.6కోట్ల 70వేల 144 రూపాయలు, నందిపేట మండలంలో 6402 మంది రైతులకు రూ.2కోట్ల 5లక్షల 54వేల 27 రూపాయలు, బాల్కొండ మండలంలో 3624 మంది రైతులకు రూ.2కోట్ల 79లక్షల 86వేల 965 రూపాయలు, మెండోరా మండలంలో 4284 మంది రైతులకు రూ.3కోట్ల 23లక్షల 66వేల 554 రూపాయలు, ముప్కాల్ మండలంలో 2789 మంది రైతులకు రూ.2కోట్ల 27లక్షల 71వేల 444 రూపాయలు, ఏర్గట్ల మండలంలో 3228 మంది రైతులకు రూ.2కోట్ల 85లక్షల 30వేల 417 రూపాయలు, భీంగల్ మండలంలో 9933 మంది రైతుల ఖాతాలలో రూ.7కోట్ల 99లక్షల 24వేల 507 రూపాయలు, కమ్మర్‌పల్లి మండలంలో 5476 మంది రైతుల ఖాతాలో రూ.4కోట్ల 35లక్షల 34వేల 283 రూపాయలు, మోర్తాడ్ మండలంలో 4983 మంది రైతుల ఖాతాలో రూ.4కోట్ల 5లక్షల 28వేల 514 రూపాయలు, వేల్పూర్ మండ లంలో 7040 మంది రైతుల ఖాతాలో రూ.5కోట్ల 42లక్షల 638 రూపాయలు, బోధన్ మండలంలో 11183 మంది రైతుల ఖాతాలో రూ.7కోట్ల 79లక్షల 17వేల 497 రూపా యలు, నవీపేట మండలంలో 8902 మంది రైతుల ఖాతాలో రూ.5కోట్ల 89లక్షల 99వేల 20 రూపా యలు, రేంజల్ మండలంలో 8348 మంది రైతుల ఖాతాలో రూ.6కోట్ల 61లక్షల 81వేల 312 రూపాయలు, సాలూర మండలంలో 4296 మంది రైతుల ఖాతాలో రూ.3కోట్ల 49లక్షల 66వేల 356 రూపాయలు, ఎడపల్లి మండలంలో 5794 మంది రైతుల ఖాతాలో రూ.3కోట్ల 73లక్షల 71వేల 542 రూపాయలు, ధర్పల్లి మండలంలో 5589 మంది రైతుల ఖాతాలో రూ.5కోట్ల 94లక్షల 26వేల 446 రూపాయలు, ఇందల్వాయి మండలంలో 6027 మంది రైతుల ఖాతాలో రూ.5కోట్ల 25లక్షల 5వేల 682 రూపాయలు, సిరికొండ మండలంలో 7802 మంది రైతుల ఖాతాలో రూ.6కోట్ల 91లక్షల 7వేల 805 రూపాయలు, డిచ్‌పల్లి మండలంలో 8628 మంది రైతుల ఖాతాలో రూ.5కోట్ల 85లక్షల 49వేల 553 రూపాయలు, జక్రాన్‌పల్లి మండలంలో 6536 మంది రైతుల ఖాతాలో రూ.4కోట్ల 73లక్షల 37వేల 619 రూపాయలు, మోపాల్ మండలంలో 7020 మంది రైతుల ఖాతాలో రూ.5కోట్ల 28లక్షల 24వేల 194 రూపాయలు, నిజామాబాద్ రూరల్ మండలంలో 6951 మంది రైతుల ఖాతాలో రూ.4కోట్ల 18లక్షల 53వేల 298 రూపాయలు, నిజామాబాద్ నార్త్ మండలంలో 266 మంది రైతుల ఖాతాలో రూ.11లక్షల 9వేల 574 రూపాయలు, నిజామాబాద్ సౌత్ మండలంలో 331 మంది రైతుల ఖాతాలో రూ.13లక్షల 87వేల 541 రూపాయలు, చందూర్ మండలంలో 2764 మంది రైతుల ఖాతాలో రూ.2కోట్ల 19లక్షల 50వేల 420 రూపాయలు, కోటగిరి మండలంలో 5096 మంది రైతుల ఖాతాలో రూ.3కోట్ల 40లక్షల 86వేల 624 రూపాయలు, మోస్రా మండలంలో 2686 మంది రైతుల ఖాతాలో రూ.ఒక కోటి 76లక్షల 59వేల 842 రూపాయలు, పోతంగల్ మండలంలో 6381 మంది రైతుల ఖాతాలో రూ.4కోట్ల 48లక్షల 55వేల 342 రూపాయలు, రుద్రూర్ మండలంలో 3387 మంది రైతుల ఖాతాలో రూ.2కోట్ల 23లక్షల 33వేల 561 రూపాయలు, వర్ని మండలంలో 5233 మంది రైతుల ఖాతాలో రూ.4కోట్ల 3లక్షల 16వేల 432 రూపాయలను ఇప్పటి వరకు జమ చేశారు.

జిల్లాలో 2లక్షల 75వేల వరకు రైతులు

జిల్లాలో ఇప్పటి వరకు మూడు ఎకరాలలోపు లక్షా 83వేల 863 మంది రైతులకు రూ.139కోట్ల 77లక్షల 92వేల 192 రూపాయలను రైతుల ఖాతాలో జమ చేశారు. జిల్లాలో మొత్తం 2లక్షల 75వేల వరకు రైతులు ఉన్నారు. ఇంకా సహాయం అందవల్సిన రైతులు లక్ష వరకు ఉండగా రైతుభరోసా డబ్బులు ఎప్పుడు జమ చేస్తారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది.

ఎమ్మెల్సీ అభ్యర్థితో ఎమ్మెల్యే మార్నింగ్ వాక్

నిజామాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి సి.అంజిరెడ్డితో కలిసి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా మార్నింగ్ వాక్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల, పాత కలెక్టరేట్ మైదానం, ఐటీఐ మైదానంలో వాక్ చేస్తూ వారికి మద్దతుగా మొదటి ప్రాధాన్యతగా ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులకు, మే ధావులకు ఎమ్మెల్యే ధన్‌పాల్ విజ్ఞప్తి చేశారు.

యూత్ కాంగ్రెస్ శిక్షణలో విపుల్‌గౌడ్

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఎన్నికైన యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు, జిల్లా అధ్యక్షులకు, నియోజకవర్గ అధ్యక్షులకు మూడు రోజుల పాటు హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో జరుగుతున్న శిక్షణ తరగతుల్లో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్‌గౌడ్ పాల్గొన్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనుంది. ఈ శిక్షణ తరగతుల్లో రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరాల నిహార్, నిజామాబాద్ రూరల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దృష్టిని మరల్చేందుకే మూడు నెలలకోసారి తెరపైకి కొత్త విషయం

- ముస్లింల ఓట్ల కోసమే వారిని బీసీ జాబితాలోకి తెచ్చారు
- రాష్ట్రంలో బీఆర్ఎస్ పని అయిపోయింది
- విలేకరుల సమావేశంలో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, చిత్రంలో ఎంపీ అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ తదితరులు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడుస్తున్నా.. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజల దృష్టిని మరల్చేందుకు మూడు నెలలకోసారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏదోక అంశాన్ని తెరపైకి తెస్తున్నారని రాజ్యసభ సభ్యుడు, జాతీయ ఓబీసీ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ విమర్శించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఎంపీ అర్వింద్, ఆదిలాబాద్ ఎంపీ నగేష్‌లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా, మూసీ ప్రక్షాళన, ఇప్పుడు బీసీ కులగణన పేరుతో ప్రజల దృష్టిని మార్చేందుకు ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారని అన్నారు. కులగణనకు బీజేపీ వ్యతిరేకం కాదని కానీ శాస్త్రీయబద్ధంగా కులగణన జరగాలన్నారు. కేవలం ఓట్ల కోసమే ముస్లింలను బీసీలలో చేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. కులగణన బిల్లులు శాసన సభలో ఆమోదించి కేంద్రానికి పంపుతామని చెబుతున్నారని, ఇచ్చిన హామీ ప్రకారం కేవలం బీసీల బిల్లును మాత్రమే కేంద్రానికి పంపాలని ఆయన సూచించారు. ముస్లింలను చేర్చి బీసీ బిల్లును ఎలా పంపుతారని కేవలం బీసీల రిజర్వేషన్ల బిల్లును పంపితే కేంద్రంతో మాట్లాడి ఆమోదించేలా చూస్తామన్నారు. కులగణన పేరుతో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇదివరకే డబ్బులు వృథా చేశారని, రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సైతం కులగణన పేరుతో రూ.300 కోట్లు వృథా చేసిందన్నారు. రాబోయే ఎమ్మెల్సీ పట్టుభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్.. అభ్యర్థులను అరువు తెచ్చుకునే పరిస్థితి ఉందన్నారు. బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల్లో డిపాజిట్లు కోల్పోయిందని ఉపాధ్యాయులు, పట్టభద్రులు ఎలాగో తమకు ఓట్లు వేయరని తెలిసి పోటీ నుంచి తప్పుకున్నారన్నారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ.. కులగణన విషయంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అట్టర్ ఫ్లాఫ్ అయ్యిందని సీఎం హోదాలో కులాల గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పని అయిపోయిందని ఉత్తర తెలంగాణలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీ నుంచి పోటీ చేసేందుకు అభ్యర్థులు లేకపోవడమే అందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ శకం ముగిసిందని బీఆర్ఎస్ దుకాణం త్వరలో మూతపడుతుందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేలు రాకేష్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్, ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, కొమురయ్య పాల్గొన్నారు.


నగరంలో ఇంధన పొదుపుపై ర్యాలీ నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్ ఉద్యోగులు

కాలుష్య రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కాలుష్య రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరుతూ హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో సాక్షం-2025 కార్యక్రమంలో భాగంగా ఆదివారం నూతన కలెక్టరేట్‌లో ర్యాలీ నిర్వహించారు. మినిస్ట్రీ ఆఫ్ పెట్రోలియం అండ్ న్యాచురల్ గ్యాస్ సూచనల మేరకు ఇంధన పొదుపుపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించినట్లు హెచ్‌పీసీఎల్ ఆర్ఎం శ్రీనివాస్ తెలిపారు. ఇంధనాన్ని పొదుపుగా వాడుకొని భవిష్యత్తు తరాలకు అందించాలని ఆయన సూచించారు. పొదుపులో భాగంగా ప్రత్యామ్నాయ వనరులైన సీఎన్‌జీ, ఎలక్ట్రానిక్ వాహనాల వైపు మొగ్గు చూపాలని ఆయన కోరారు. కాలుష్య రహిత వాతావరణం కోసం ఇంధన వినియోగాన్ని తగ్గించాలని శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ అధికారి యతేంద్ర కోమా, డీలర్లు శ్రీకాంత్‌రెడ్డి, విజయ్‌నాథ్, వినోద్‌రెడ్డి, సందీప్, మహేష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష నాయకులు అనవసర మాటలతో కాలం వెల్లదీస్తున్నారు

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గత వారం పదిరోజులుగా మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, ఎంపీ అర్వింద్‌లు వారి స్థాయిని మర్చి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పని అయిపోయిందని, ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందని ప్రతిపక్ష నాయకులు అనవసర మాటలతో కాలం వెల్లదీస్తున్నారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవేణుతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. బీసీ కులగణన విషయంలో ఎంపీ అర్వింద్ మాట్లాడటం సిగ్గుచేటని అసలు బీసీ కులగణనపై బీజేపీ పాత్ర ఏమిటో అర్వింద్ జవాబు చెప్పాలన్నారు. జిల్లాకు అప్పుడప్పుడు వస్తూ ప్రభుత్వంపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని నీ స్థాయిని నువ్వే తక్కువ చేసుకున్న వారివి అవుతావన్నారు. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కులగణన విజయవంతంగా జరిగిందని కులగణన చేయడం ద్వారా ఎవరి వాటా ఎంతో తెలిస్తే తమ ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని ప్రతి ఒక్కరు తమ వాటా అడుగుతారని అర్వింద్ భయపడుతున్నారని అన్నారు. బీసీ కులగణన చేయాలా వద్ద అనేది కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ అర్వింద్ చెప్పాలన్నారు. బీసీలో మైనార్టీలు ఎలా ఉంటారని బీజేపీ ప్రశ్నిస్తుందని మరి మోదీ ప్రవేశపెట్టిన ఈడబ్ల్యుఎస్ కోటాలో మైనార్టీలు లేరా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పాపాలు కడగడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి సంవత్సరంన్నర కాలం పట్టిందన్నారు. ఎమ్మెల్సీ కవిత అబద్ధాలు మాట్లాడుతూ విలువ తగ్గించుకోవద్దన్నారు. కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నరేందర్‌రెడ్డికి టికెట్ ఇచ్చామని సోమవారం భూమారెడ్డి గార్డెన్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని పట్టభద్రులు నరేందర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలన్నారు. బీసీలుగా ఉన్న బీజేపీ నాయకులు బీసీ కులగణను వ్యతిరేకిస్తున్నారని అది వారి పిచ్చితనానికి నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో నాయకులు నరాల రత్నాకర్, రామర్తిగోపి, వేణురాజ్, నరేందర్‌గౌడ్, జావిద్ అక్రమ్, గడుగు రోహిత్, ప్రీతమ్ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీరని ద్రోహం



సమావేశం మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

వర్ని,ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌ను సవరించి, మార్పులు, చేర్పులు చేసి శ్రామిక వర్గానికి నిధులు పెంచాలని ప్రజా సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వర్ని మండల కేంద్రంలో తెలంగాణ ద్రోహం-బడా బాబులకు భోజ్యం అనే అంశంపై కేంద్ర బడ్జెట్ మీద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చర్చగోష్టి నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందన్నారు. నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డుకు నిధులు కేటాయించలేదని మండిపడ్డారు. బోధన్‌నుంచి బీదర్ వరకు రైల్వే లైన్ చర్చ చేయలేదని ఆరోపించారు.జక్రాన్‌పల్లిలో విమానాశ్రయానికి నిధులు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పలు యూనియన్ నాయకులు నన్నేసాబ్, సాయిలు,లింగం,మల్లేష్, జీశాన్, అలీ పాషా, సురేష్, సాయిలు, మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ గ్రాడ్యుయేషన్ పట్టభద్రుల ఎన్నికల ప్రచారం



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

రుద్రూరు,ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ గ్రాడ్యుయేషన్ పట్టభద్రుల ఎన్నికల ప్రచారంలో భాగంగా భారతీయ జనతా పార్టీ బలపరిచిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్న మైల్ అంజిరెడ్డికి మద్దతుగా కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గం రుద్రూర్ మండలంలోని రుద్రూర్ గ్రామంలో ప్రచారం చేయడం జరిగింది. ఇందులో భాగంగా గ్రాడ్యుయేట్ ఓటర్ ఇంటి దగ్గరికి వెళ్లి చిన్న మైల్ అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయమని అభ్యర్థించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రూరు మండల అధ్యక్షులు అలపాటి హరికృష్ణ, జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రశాంత్ గౌడ్, మండల సీనియర్ నాయకులు కటిక రామ్‌రాజ్, పార్వతి మురళి, చిదుర మహిపాల్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పసుపు రైతుల రిలే నిరాహార దీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న పసుపు రైతులు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నేటి నుంచి ఐదు రోజుల పాటు పసుపు రైతులు రిలే నిరాహార దీక్ష చేస్తున్నామని రైతులు వినోదరెడ్డి, వెల్మ ముత్యంరెడ్డి, నక్కల రాములు, వన్నెల గంగారెడ్డిలు తెలిపారు. ఆదివారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుతం పసుపు ధర రూ.10వేలు ఉందని, రైతులకు గిట్టుబాటు కావడం లేదని, మద్దతు ధరను రూ.17వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు రాజు అని చెబుతున్న ప్రభుత్వాలు రైతులను పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రిలే నిరాహార దీక్షకు పసుపు రైతులు పెద్ద ఎత్తున మద్దతు తెలపాలని వారు కోరారు.

కొనసాగుతున్న వేంకటేశ్వరస్వామి జాతర

● నేడు స్వామివారి రథోత్సవం

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, జాతరలో భాగంగా మండలంలోని అర్గుల్ గ్రామంలో శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం రాత్రి దొంగల దోపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమార్చనలో పాలొన్నారు. సోమవారం స్వామివారి రథోత్సవం జరగనుంది. ఈ కార్యక్రమంలో వీడీసీ ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి, క్యాషియర్ అల్లురి బాస్కర్ రెడ్డి, వీడీసీసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నవీపేటలో రెండు బైక్‌లు ఢీ

నవీపేట,ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాసర రోడ్డు మూల మలుపు సమీపంలో ఆదివారం రాత్రి రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన చల్లా మహేందర్ బైక్‌పై నవీపేట నుండి నందిపేట రోడ్డు వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొనడంతో మహేందర్ కాలికి తీవ్ర గాయాలయ్యాయని వారు పేర్కొన్నారు. వెంటనే అతనిని అంబులెన్సులో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించడం జరిగిందని వారు వివరించారు. ఈ విషయంపై ఎస్ఐ వినయ్‌ని వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

సమాజ మార్పుతోనే సమసమాజ నిర్మాణం



రాజన్న సంస్మరణ సభలో మాట్లాడుతున్న డీటీఎఫ్ నాయకులు

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): సమాజ మార్పుతోనే సమాసమాజ నిర్మాణం సాధ్యమవుతుందని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాంతన్, జిల్లా అధ్యక్షుడు బాలయ్య అన్నారు. ఆదివారం ఆర్మూర్ పట్టణంలోని సిద్దర్థ కళాశాలలో డీటీఎఫ్ మాజీ జిల్లా ప్రధానకార్యదర్శి స్వర్గీయ ఆర్.రాజన్న సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్.రాజన్న మృతి చెందడం వల్ల ఒక సామాజిక ఆలోచన కలిగిన ఉద్యమకారుడిని డీటీఎఫ్ కోల్పోయిందన్నారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదని, ఆయన ఆదర్శాలు, ఉద్యమస్ఫూర్తి కొనసాగించడమే ఆయన సమర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ నాయకులు డాక్టర్ లచ్చయ్య, శ్రీధర్, యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సత్యనంద్, డీటీఎఫ్ నాయకులు పెంటన్న, విజయ్ కుమార్, రాజేందర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో స్తంభించిన రిజిస్ట్రేషన్లు

- సెలవుల్లో ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్లు
- రూరల్‌లో అదేతీరు
- ఇన్‌చార్జీగా సీనియర్ అసిస్టెంట్
- అర్థం కాక పెండింగ్‌లో డాక్యుమెంట్లు



నిజామాబాద్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఇదే..

ఖిల్లా,ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి):జిల్లా కేంద్రంలోని అర్బన్, రూరల్ సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు నిలచిపోయాయి. ప్రభుత్వానికి ఎక్కువ ఆదాయం సమకూర్చే ఆశాఖ అస్తవ్యస్తంగా మారింది. పూర్తిస్థాయి అధికారులు లేక వినియోగదారుల డాక్యుమెంట్ల ప్రక్రియ పూర్తికాక నానా అవస్తలు పడుతున్నారు.నిజామాబాద్ అర్బన్‌లో ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్లు ఉండగా ఇద్దరు కూడా సెలవులో ఉండడం వల్ల కార్యాలయంలో పనులు చేయడానికి ఇన్‌చార్జీగా సీనియర్ అసిస్టెంటెంట్‌ను విధుల్లో పెట్టారు.అర్బన్, సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ప్రతి రోజు 70నుంచి 80 వరకు డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ కోసం వినియోగదారులు వస్తుంటారు. వినియోగదారుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆ శాఖాధికారులు ఇద్దరు అధికారులను నియమించారు. వీరిలో ఒకరు గత వారం రోజులుగా సెలవు పెట్టి విహార యాత్రకు వెళ్లారు. ఒకే సబ్‌రిజిస్ట్రార్ వారం రోజులుగా విధులు నిర్వహించి అలసిపోయినట్లున్నారు. అందుకే ఆయన కూడా తమకేమిటి అన్నట్లుగా వ్యవహరించి శనివారం తమకు కలసి వస్తుందని భావించి సెలవు పెట్టారు. రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వారికి అందుబాటులో ఉంచడానికి ఇన్‌చార్జీ సబ్ రిజిస్ట్రార్‌ను విధుల్లో పెట్టారు.వినియోగదారులు రిజిస్ట్రేషన్‌కు ముందు రోజే వారు స్లాట్ తీసుకుంటారు. కాని వాటిని రిజిస్ట్రేషన్ చేయడానికి సబ్‌రిజిస్ట్రార్లు లేక పోవడంతో వినియోగదారులు కార్యాలయంలో సాయంత్రం వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కాని సదరు అధికారికి డాక్యుమెంట్ల పనులుతెలియక పోవడంతో ఆయన కొన్ని డాక్యుమెంట్లను పెం డింగ్‌లో పెట్టారు. ప్రతి రోజు పదుల సంఖ్యలో జరిగే డాక్యుమెంట్ల స్థానంలో కేవలం పది రిజిస్ట్రేషన్లు కాలేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

● రాష్ట్రప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా అత్యధికంగా ఆదాయం

రాష్ట్ర ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా అత్యధికంగా ఆదాయం సమకూర్చుతుండగా జిల్లా కేంద్రంలోని అర్బన్, రూరల్ సబ్‌రిజిస్ట్రార్ల పరిస్థితి దారుణంగా తయారైంది. సబ్‌రిజిస్ట్రారులుగా బదిలీపై వచ్చిన వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ వినియోగదారులతో ఆడుకుంటున్నారు. వినియోగదారులకు సకాలంలో పనులు చేయకపోగ ఎక్కువ డబ్బులు ఇచ్చిన వారి పనులు చేయడం పరిపాటిగా మార్చుకున్నారు. దీంతో ఆ శాఖకు రావాలసిన ఆదాయం సమకూర్చడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● రూరల్‌లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది

రూరల్ సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయంలో డాక్యుమెంట్ల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. బదిలీల్లో భాగంగా రూరల్ సబ్‌రిజిస్ట్రార్‌గా ప్రభుత్వం ఇతర జిల్లా నుంచి బదిలీ చేశారు. అయితే సదరు సబ్‌రిజిస్ట్రార్ విధుల్లో రాకుండా దీర్ఘకాలంగాసెలవుల్లో వెళ్లిపోయారు. అప్పటి నుంచి రూరల్ సబ్ రిజిస్ట్రార్‌గా సీనియర్ అసిస్టెంటెంట్‌ను ఇన్‌చార్జీగా కొనసాగిస్తున్నారు. ఇటీవల సదరు ఇన్‌చార్జీ సబ్‌రిజిస్ట్రార్ కూడా అనారోగ్యం దృష్ట్యా సెలవు పెట్టారు. ఆయన స్థానంలో మరో సీనియర్ అసిస్టెంటెంట్‌కు ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగించారు. ఆ అధికారినిణికి డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్‌లో అంతగా అనుభవం లేకపోవడంతో ప్రతి రోజు పదుల సంఖ్యలో జరిగే డాక్యుమెంట్లు కేవలం 5నుంచి 8వరకు జరుగుతున్నాయి. ఇలా జరుగడం వల్ల స్లాట్ బుక్ చేసుకున్న వినియోగదారులు సాయంత్రం వరకు వేచి ఉండి తిరిగి వెళ్లిపోతున్నారు. తమకు అత్యవసరం ఉందని శుక్రవారం కొందరు వినియోగదారులు డాక్యుమెంట్లు చేయాలని డిమాండ్ చేయగా సదరు అధికారిణి పోలీసులను రప్పించి వినియోగదారులను బయటకు పంపివేసినట్లు సమాచారం.

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

● రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతుకులు ఎల్ల వేళల అండగా ఉంటుందని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నా రు. ముప్కాల్ మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశంలో రైతు కార్యాచరణ కమిటీ నాయకులు ప్రభాకర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రైతులు పండించిన ఎర్రజొన్న, పసుపు పంటలను మధ్య దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. పంటలకు గిట్టుబాటు ధర అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మగ్గిడి ముత్యంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు గడ్డం చిన్నారెడ్డి, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైడి చందరవి, కిసానఖేత్ అధ్యక్షుడు బద్దం సాగర్, పట్టణ అధ్యక్షుడు ముస్కు మోహన్, సుంకెట రాజ్‌కుమార్, ఏలేటి మల్లారెడ్డి, లోక సుబాష్, ప్ర శాంత్‌రెడ్డి, అబ్రార్, ముస్కు శ్రీనివాస్, ప్రవీన్, కిశోర్, నవీన్, పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనకు పోరాడిన కామ్రేడ్ యాదగిరి



కిసాన్‌నగర్‌లో గోడప్రతులను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కార్యదర్శి ముత్తెన్న

ఆర్మూర్‌రూరల్,ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి):బీడీ కార్మికుల హక్కుల సాధనకు నిరంతరం పోరాటాలు చేసి హక్కులు సాధించి పెట్టడంలో కామ్రేడ్ యాదగిరి ముందున్నారని తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్. ముత్తెన్న అన్నారు. ఆదివారం బాల్కొండ మండలం కిసాన్‌నగర్ గ్రామంలో కామ్రెడ్ కర్నాటి యాదగిరి సంతాప సభ గోడప్రతులను ఆవిష్కరించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పంథ రాష్ట్ర నాయకులుగా 33ఏళ్ల జిల్లా కార్యదర్శిగా కొనసాగిన యాదగిరి అకాల మరణం చెందడంతో దురదృష్టకరమన్నారు. జిల్లాలో రైతు కూలీ సంఘాలను, బీడీకార్మిక విద్యార్థి యువజన, ప్రజా సంఘాలను ఏర్పాటు చేసి హక్కుల సాధనకు నిరంతరం శ్రమించాలన్నారు. బీడీకార్మికుల సమస్యల పరిష్కారానికి బీడీకార్మికుల సంఘం ఏర్పాటు చేసి బీడీకార్మికుల అనేక సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల నాయకులు టి.శ్రీనివాస్; నిఖిల్, వినోద్, ఉమేష్, చిన్నదాసు, సునీల్, వినేష్, ప్రణయ్, తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి కరపత్రాల ఆవిష్కరణ



రాకాసిపేట్ హనుమాన్ మందిరం వద్ద కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని రాకాసిపేటలోని హనుమాన్ మందిరం వద్ద హిందు వాహిని బోధన్ శాఖ ఆధ్వర్యంలో శ్రీ ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా హిందు వాహిని జిల్లా ఉపాధ్యక్షులు పులి సాయిలు ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19వ తేదిన ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి ఉందన్నారు. రాకాసిపేట హనుమాన్ మందిరం నుండి బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వరకు శివాజీ మహరాజ్ విగ్రహంతో శోభాయాత్ర నిర్వహించడం జరుగుతుందన్నారు. హిందు బంధువులందరు అధిక సంఖ్యలో పాల్గొని ప్రతి ఒక్కరు శివాజీ మహరాజ్ జయంతిని విజయదంతం చేయాలని కోరారు. యువత ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు ముందుకు వెళ్లాలన్నారు. హిందువుల ఐక్యత చాటాలని, దేశం కోసం, ధర్మం కోసం ప్రతి హిందువు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో హిందు వాహిని నగర కార్యదర్శి సుంకు శేఖర్, సురేష్ పాటిల్, ఒడ్డెన్న, రాజు, అయ్యప్ప శ్రావణ్, సతీష్, శ్రీకర్, సందీప్ తదితరులున్నారు.

మేడ్చల్‌లో మండల వాసి హత్య

మాచారెడ్డి,ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మాచారెడ్డి మండలానికి చెందిన సోమర్‌పేట్ గ్రామానికి చెందిన గుగులోత్ ఉమేష్ (25)ను మేడ్చల్ పట్టణంలోని బస్ డిపో ఎదుట గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో పోడిచి దారుణ హత్య చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. మేడ్చల్ బస్సు డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా మృతుని తండ్రి గన్యా పనిచేస్తుండగా కుటుంబంతో సహా మేడ్చల్‌కు వెళ్లి నివాసం ఉంటున్నారు. మృతుడు గత నాలుగేళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకోన్నాడు. మద్యానికి బానిసై జల్సాలకు అలవాటు పడడంతో కుటుంబసభ్యులు దూరంగా ఉంటున్నారు. ఈనేపథ్యంలో గుర్తుతెలియని వ్యక్తులు ఉమేష్‌ను హత్యచేయడంతో గుర్తించిన ఆర్టీసీ అధికారులు గన్యాకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి వెళ్లిన గన్యా కుమారుడిని చూడగా రక్తపు మడుగులు కనిపించాడు. కుమారుడిని ఎవరు చంపారనేది తెలియదని తండ్రి తెలిపాడు. మృతునికి భార్య, కూమారుడు,కూతురు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బోధన్‌రూరల్,ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలం కల్దుర్కి వైపు నుండి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఒక ట్రాక్టర్‌ను పెగడాపల్లి గ్రామం దగ్గర పట్టుకుని కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ నియమ, నిబంధనల మేరకే ఇసుక రవాణా చేయాలన్నారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కేసులతో పాటు సీజ్ చేయబడతాయని హెచ్చరించారు.

రోడ్డుప్రమాదంలో దోమకొండ వాసి మృతి



వెంకట్‌గౌడ్(ఫైల్)

దోమకొండ, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్‌లో జరిగిన రోడ్డుప్రమాదంలో దోమకొండ మండలంలోని సీతా రాంపూర్ గ్రామానికి చెందిన పులబోయిన వెంకట్‌గౌడ్(32) మృతిచెందినట్లు గ్రామ స్తులు ఆదివారం తెలిపారు. గ్రామస్థులు, స్నేహితులు తెలిపిన వివరాల ప్రకారం వెంకట్‌గౌడ్ గజ్వేల్‌లో ఒక శుభాకార్యానికి వెళ్లగా వారు ప్రయాణి స్తున్న కారును ఎదురుగా వస్తున్న మరో కారు ఢీకొనడంతో వెంకట్‌గౌడ్ అక్కడిక్కడే తీవ్రగా యాలతో మృతిచెందినట్లు తెలిపారు. వెంకట్‌గౌడ్ మృతి చెందిన విష యం తెలుసుకున్న సీతారాంపూర్ గ్రామస్థులు, కుటుంబ సభ్యులు, బంధు వుల వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహంపై పడి బోరున విలపించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ



రాజారాం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్గుల్ గ్రామంలో మాజీ ఆర్థిక శాఖ మంత్రి స్వర్గీయ అర్గుల్ రాజారాం మరదలు గడ్డం గంగాభగీర్థి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం ఆమె కుటుంబ సభ్యులు నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్, నిజామాబాద్ మాజీమేయర్ ధర్మపరి సంజయ్ పరామర్శించారు. అంతకు ముందు నిజామాబాద్ అర్బన్ మాజీఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ పరామర్శించారు. పరామర్శించిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి, బీజేపీ కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు పి.తిరుపతిరెడ్డి, జక్రాన్‌పల్లి మండల బీజేపీ అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అర్గుల్ నర్సయ్య, మాజీసర్పంచ్ గోర్తె రాజేందర్, తదితరులు ఉన్నారు.

దొన్‌పాల్‌లో నిత్యావసర సరుకుల పంపిణీ



దొన్‌పాల్‌లో నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్న దుర్గాప్రసాద్

మోర్తాడ్, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొన్‌పాల్ గ్రామంలో ఆదివారం గమా ఫౌండేషన్ చారిట్రబుల్ ట్రస్ట్ సీఈవో దుర్గాప్రసాద్ మహిళలకు నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. బాల్కొండ నియోజకవర్గ ప్రాజెక్టు డైరెక్టర్ కోరం ప్రకాష్ ఆధ్వర్యంలో ఆదివారం ఆహార భద్రతలో భాగంగా పేదలకు సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొప్పదండి ప్రధాన కార్యదర్శి కొత్తూరి సురేష్, కరీంనగర్ జిల్లా ప్రధానకార్యదర్శి టిపల్లి శ్రావణ్ కుమార్, శ్రీనివాస్, మోహన్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో ప్రజాపాలన కేంద్రం ప్రారంభం



కమ్మర్‌పల్లి ఎంపీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రం

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 16: (ఆంధ్రజ్యోతి) రాష్ట్రప్రభుత్వం అందజేస్తున్న పథకాల లబ్ధిదారుల, కుటుంబ సర్వే వివరాలు సభ్యుల పేర్లు నమోదు నిమిత్తం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన కేంద్రాన్ని ఆదివారం మండల ఎంపీడీవో రాజా శ్రీనివాస్ ప్రారంభించారు. ఈకేంద్రంద్వార ఎస్ఈఈఈపీసీ సర్వే డాటా నమోదుచేయడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇడ్లు కోసం జాబితా చేయబడిన నవి కాని, వివిధ కారణాలవల్ల లబ్దిదారుల పేర్లు నమో దు కాని కుటుంబాలవారు మండలపరిషత్ కార్యాలయంలోప్రారంభించిన ప్రజాపాలన కేంద్రంలోనే నమోదు చేసుకోవచ్చని ఎంపీడీవో తెలిపారు.ఈఅవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రెంజల్ జిల్లా పరిషత్ పాఠశాలలో పూర్వ విద్యార్థులు

రెంజల్,ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు వారంతా ఒకే చోట కలుసుకున్నారు. ఒకే పాఠశాలలో కలిసి చదువుకున్నారు. పదవ తరగతి వరకు కలిసి చదివి ఉన్నత చదువుల కోసం ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. 24ఏళ్ల తర్వాత తిరిగి కలుసుకున్నారు. రెంజల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2001-2002బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. తమకు విద్యాబుద్దులు నేర్పిన గురువులను సన్మానించి వారి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. 24సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మళ్లీ పాఠశాలలో పదవ తరగతి వరకు కలిసి చదివిన విద్యార్థులందరు ఒక చోటుకు చేరుకొని వారి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అంతకు ముందు చదివిన పాఠశాలలోని తరగతి గదిలో కూర్చుని గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి రోజంతా ఆనంద ఉత్సాహల్లో మునిగితేలారు. 24ఏళ్ల తమ జీవితంలో జరిగిన మధుర జ్ఞాపకాలను ఒకరినొకరు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సతీష్, సాయిలు, గంగాధర్, రాజేష్, నాగోజి, శ్రీనివాస్, రవి, కిషన్, యశ్వంత్, సంతోష్, పోశెట్టి, సురేష్, సౌజన్య, అనురాధ, నవత, గౌతమి, రజిత తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిపేట పాఠశాల చరిత్ర మొదటి ఆత్మీయ సమ్మేళనం



రెడ్డిపేట ఆత్మీయ సమ్మేళనంలో కలిసిన ఉపాధ్యాయులు,విద్యార్థులు

కామారెడ్డిటౌన్,ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి):రామారెడ్డి మండలం రెడ్డిపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో 1998-99 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు సిల్వర్ జూబ్లి సందర్భంగా ఆదివారం కలుసుకున్నారు.రెడ్డిపేట పాఠశాల చరిత్రలో మొట్టమొదటి ఆత్మీయ కలయిక కావడం చాలా సంతోకరంగా ఉందని ఉపాధ్యాయులు పేర్కోన్నారు.అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం ఉపాధ్యాయులకు విద్యార్థులు బోకే అందజేసి శాలువా,మెమెంటోలతో ఆత్మీయంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆనాటి ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌గౌడ్, ఉపాధ్యాయులు దత్తాద్రి, వెంకట్‌గౌడ్,శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

బొంపల్లిలో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో 2009-10 బ్యాచ్ విద్యార్థులు

సదాశివనగర్,ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి):మండలంలోనిభూంపల్లిలో2009 -10 విద్యాసంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు అపూర్వసమ్మేళనం నిర్వహించారు.ఈసందర్భంగా ఒకరికొకరుఆప్యాయతతో పలకరించుకుని గతజ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.స్నేహనికి ప్రతీకగా మెమోంటోలు అందజేసుకున్నారు.

ఫటా..ఫట్...

రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు

● అపర్ణ, మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి



వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో గతంలో లేని విధంగా దొంగతనాల ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయ మార్కెట్ కమిటీ సెలక్షన్‌గ్రేడ్ కార్యదర్శి అపర్ణ తెలిపారు.

ఆంధ్రజ్యోతి: మార్కెట్‌యార్డ్‌లో దొంగతనాల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.?

సెలక్షన్‌గ్రేడ్ కార్యదర్శి: మార్కెట్ యార్డ్‌లో దొంగతనాలు జరుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాము, సిబ్బందిని రాత్రివేళ నిఘా పెట్టాలని ఆదేశిస్తున్నాము

ఆంధ్రజ్యోతి: యార్డ్‌లో సీసీ కెమారాల పరిస్థితి ఎలా ఉంది?

సెలక్షన్‌గ్రేడ్ కార్యదర్శి: యార్డ్‌లో ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమారాల నిఘా పటిష్టం చేశాము.అక్కడక్కడ చెడిపోయిన కెమారాలను ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేయిస్తున్నాము

ఆంధ్రజ్యోతి: సెక్యూరిటీ సిబ్బందిని పెంచుతున్నారా?

సెలక్షన్‌గ్రేడ్ కార్యదర్శి: ప్రస్తుతం ఉన్న సెక్యూరిటీ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాము.నిఘా పటిష్టం చేస్తున్నాము

ఆంధ్రజ్యోతి: రైతులకు యార్డ్‌లో విశ్రాంతి నిలయం అందుబాటులో ఉందా?

సెలక్షన్‌గ్రేడ్ కార్యదర్శి: రైతులు విశ్రాంతి తీసుకునే గదులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుతున్నాము. మహిళ రైతులకు ఇబ్బంది కలుగకుండా వారి కోసం ప్రత్యేకంగా గదులు ఏర్పాటు చేశాము.

● (ఆంధ్రజ్యోతి, ఖిల్లా)

ఉన్నత చదువులు చదివినా వ్యవసాయంపైనే మక్కువ

● అధిక దిగుబడులు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న దంపతులు ● ప్రణాళిక బద్ధం సాగుతో అధిక లాభాలు

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): చదివింది ఉన్నత విద్య.. చేస్తోంది వ్యవసాయం. బడిలో పాఠాలు బోధించాల్సిన వారు తోటి రైతులకు వ్యవసాయంలో సాగు పాఠాలు చెప్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.. ఆర్మూర్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన దయానంద్, సుప్రియ దంపతులు. ఉన్నత చదువులు చదివినప్పటికీ భూమిని నమ్ముకొని వ్యవసాయం చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తూ లాభాలను అర్జిస్తున్నారు. దయానంద్ ఎంఏ బీఈడీ పూర్తి చేయగా సుప్రియ ఎంఎస్సీ బీఈడీ చదివారు. వారికి వ్యవసాయంపై ఉన్న మక్కువతో పాఠశాల వైపు కాకుండా పొలం వైపు నడిచారు. ప్రణాళిక బద్ధం సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

పసుపులో అధిక దిగబడులు

అన్ని పంటలు సాగు చేస్తున్నప్పటికీ ఆర్మూర్ ప్రాంత పసిడి పంట అయిన పసుపు పంటలో అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ఈ ఏడాది పసుపు ఎకరాన పది ట్రాక్టర్‌ల చొప్పున దిగుబడి సాధించారు. గత సంవత్సరంలో మూడు ఎకరాలలో పసుపు పంట సాగు చేసిన రైతు దయానంద్ సుమారు రూ.12లక్షల ఆధాయం ఆర్జించారు. పసుపును మూడు దఫాలుగా విక్రయించారు. సాంగ్లీలో విక్రయించిన పసుపునకు అధిక ధర క్వింటాలుకు రూ.18వేలు వచ్చింది. ఈ సంవత్సరం కూడా మూడు ఎకరాల్లో పసుపు సాగు చేస్తున్నారు. మద్దతు ధర ఆశించిన విధంగా అధిక లాభలు వస్తాయని విశ్వసిస్తున్నారు.

పెట్టుబడి, శ్రమ ఎక్కువ

పసుపు పంట సాగులో పెట్టుబడితో పాటు శ్రమ కూడా అధికంగా ఉంటుంది. ఎకరాన సుమారు రూ. లక్ష పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. పసుపు మంచి దిగుబడుల కోసం భూమిలో నల్లమట్టి, కోళ్ల ఎరువు, గొర్రె, మేకల ఎరువులు వేసి భూమిని సారవంతం చేస్తున్నారు. వీటి ఖర్చుతో పాటు రసాయనిక, యూ రియా ఎరువుల వినియోగానికి డబ్బులు వెచ్చించాల్సి వస్తోంది. పసుపు తవ్వేందుకు, ఉడకబెట్టేందుకు ఖర్చులు అధికంగానే ఉంటున్నాయి. పసుపు తవ్వేందుకు ఎకరాన రూ.20 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఉడకబెట్టేందుకు అద్దె చెల్లించాలి. ఉడకబెట్టేందుకు కట్టేలు కొనుగోలు చేయాల్సి వస్తోంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుంటే ఖర్చు ఎక్కువే, శ్రమ ఎక్కువే.

మంచి ధర వస్తే లాభాల పంట

పసుపు పంటకు మంచి ధర లభిస్తే లాభల పంట పండుతుంది. గత సంవత్సరం సాంగ్లీ మార్కెట్‌లో గరిష్ఠంగా క్వింటాలుకు రూ.18వేలు వచ్చింది. నిజామాబాద్‌లో తక్కువ ధరకు అమ్మాల్సి వచ్చింది. మూడు దఫాలుగా పసుపును విక్రయించగా సుమారు రూ.12లక్షలు ఆదాయం వచ్చింది.

వేసవిలో టమాట



ఖరీఫ్ సీజన్ నుంచి వరి, పసుపు, మొక్కజొన్న, ఎర్రజొన్న పంట సాగు చేస్తున్నప్పటికీ వేసవిలో ప్రధానంగా టమాట పంట సాగు చేస్తున్నాయి. గత సంవత్సరం మూడు ఎకరాలలో టమాట పంట సాగు చేయగా రూ.7 లక్షల వరకు ఆధారం పొందారు. పంట తీసిన నాటి నుంచి కరిష్ఠంగా రూ.100 నుంచి గరిష్ఠంగా రూ.1400వరకు బాక్సు (23కేజీల) విక్రయించారు. టమాటలను కొసిన ప్రతీసారి వంద బాక్సులు విక్రయించాం. టమాట పంట జూదం లాంటిదే. అన్ని అనుకూలిస్తే లాభాలు, కాలం కలిసిరాకపోతే పెట్టుబడులు కూడా రావు.. ఒక్కోసారి పంట చేతికి రాక నష్టాలనే ఇస్తోంది. టమాట పంటకు వైరస్ సోకిన, అతిగా వర్షాలు కురిసిన ఎక్కువ, ఎండలకు దిగుబడులు తగ్గిపోయి నష్టాలనే మిగులుస్తుంది.



తవ్విన పసుపు పంట



పసుపు పంట (ఫైల్)

పసుపును ఆరబెట్టడం రైతులకు సమస్యగా మారింది

● దయానంద్, రైతు రాంపూర్



ప్రణాళిక బద్ధంగా సాగు చేస్తే వ్యవసాయాన్నిమించింది లేదు. వ్యవసాయంలోనే 'సాయం' అనే పదం ఉంది. పసుపు సాగు చేసే రైతులకు ఇబ్బందులు ఉన్నాయి. పసుపు ఆరబెటడం సమస్యగా మారింది. స్థలాల కొరతతో పసుపు ఆరబెట్టడానికి సరైన ప్లాట్ ఫాంలు లేవు. పసుపు ఉడకబెట్టి వెంటనే ఆరబెట్టే యంత్రాలు అందుబాటులోకి వచ్చి సబ్సిడిపై అందజేస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

వ్యవసాయానికి మించినది లేదు

● సుప్రియ, రైతు, రాంపూర్

సాగునీటి వసతి ఉండి, భూమి ఉండి కష్టపడే తత్వం ఉంటే వ్యవసాయానికి మించిది లేదు. తాము వ్యవసాయం చేస్తూ పది మందికి ఉపాధి కల్పిస్తున్నామన్న భావన ఎంతో సంతోషాన్ని ఇస్తోంది. ఉన్నత చదువులు చదివిన్పటికీ వ్యవసాయం చేయడంలోనే సంతృప్తిగా ఉంది.

బెహరాన్‌లో స్వచ్ఛ భారత్ వేడుకలు



స్వచ్ఛ భారత్ వేడుకల్లో పాల్గొన్న తెలుగు వారియర్స్ కమిటీ సభ్యులు

భీమ్‌గల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): భారతదేశ స్వచ్ భారత్ అభియాన్ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన స్వచ్ఛ భారత్ అభియాన్ పరిశుభ్రత దృక్పధంలో ప్రేరణ పొందిన ఇక్కడ ప్రాంత యువకులు బ్రహెయిన్ బీచ్లను శుభ్రం చేయాలని లక్ష్యంతో సంవత్సం క్రితం కలకలం కట్టుకొని తెలుగు వారియర్స్ కమిటీగా ఏర్పడి అక్కడి బీచ్లను పరిశుభ్రం చేశారు. ఈ కమిటీ ఏర్పడి ఏడాది ముగియడంతో ఆదివారం ప్రథమ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీచ్లలో పడి ఉన్న వ్యర్థ పదార్థాలను తీసి పరిశుభ్రంగా చేయడంతో పాటు స్వచ్ఛ అభియాన్‌పై అక్కడ ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను కూడా వివరించారు స్వచ్ఛ బెహరన్‌గా తీర్చిదిద్దాలని తమ కమిటీ ద్యేయమని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు వారియర్స్ కమిటీ సభ్యులు నవీన్, రాంమోహన్, కొత్తపల్లి మహేష్, మీరీ పెప్పి అశోక్, బుయామి గంగాధశర్, పెప్సీ తిరుపతి, భూమేశ్వర్, పరమేశ్వర్, మంద అరవింద్, నవీన్, గంగారెడ్డి, రంజిత్, సుమన్, భీమేష్, సాగర్, రవీంధర్, తదితరులు పాల్గొన్నారు.

చీకట్లోనే ప్రయాణాలు.. మహిళలకు తప్పని తిప్పలు

● భయం గుప్పిట్లో బీటీఎస్ చౌరస్తా
● రోజుకు వేల మంది ప్రయాణాలు
● గతంలో కలెక్టర్‌కు విన్నవించినా పరిష్కారం కాని సమస్య

దోమకొండ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బీటీఎస్ చౌరస్తా అంటే ఉమ్మడి నిజామాబాద్ మెదక్ జిల్లాలకు ప్రధాన చౌరస్తా.. తెలంగాణ సౌత్ క్యాంపస్, హస్టల్‌లో చదువుతున్న విద్యార్థులు తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఉన్నారు. వారి తల్లిదండ్రులు సైతం వచ్చి వెళ్తుంటారు. దీంతో పాటు దోమకొండ, బీబీపేట,దుబ్బాక సిద్దిపేట, గంభీరావ్‌పేట, సిరిసిల్ల వరకు ప్రజలు ప్రతి రోజుల వేల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు.నిత్యం పదుల సంఖ్యలో ఆర్టీసీ బస్సులు, ప్రవైటు వాహానాలు ట్రిప్పులు నడుస్తుంటాయి. కానీ ఆ బీటీఎస్ చౌరస్తా గత కొన్ని రోజుల నుంచి చిన్నబోయింది.

బీటీఎస్‌లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ వినతి

గతంలో గ్రామ సభలు నిర్వహించిన సమయంలో జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ లింగుపల్లి గ్రామాన్ని సందర్శించేందుకు వచ్చిన సమయంలో దోమకొండ మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అనంత్‌రెడ్డి, నాయకులతో కలసి బీటీఎస్‌లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ వినతిపత్రం అందజేశారు. అయిన కుడా ఇప్పటి వరకు అక్కడ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయలేదని ఇటుగా ప్రయాణాలు కొనసాగించే మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు విన్నవించిన సమస్య పరిష్కరానికి నోచుకోవడం లేదని పలువురు చర్చించుకుంటున్నారు.



బీటీఎస్ చౌరస్తా వద్ద చీకటిగా ఉన్న దృశ్యం



చీకట్లోనే బస్సుకోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

వేలమంది.. వందల వాహనాలు

బీటిఎస్ నుంచి నేషనల్ హైవే మీదుగా రోజుకు వేల మంది, వందల వాహానాలు వెళ్తుంటాయి. హైదరాబాద్‌తో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే బీటీఎస్‌లో చీకటిగా ఉండటంతో మహిళలు రాత్రి సమయంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు బీబీపేట, దోమకొండ, దుబ్బాక ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు బస్సుల కోసం ఇక్కడే వేచిచూడాలి. చీకటిగా ఉండటంతో మహిళలు భయందోళనకు గురౌతున్నారు. సౌత్ క్యాంపాస్ విద్యార్థులు సైతం వివిధ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లి తిరిగి రావాలంటే బీటీఎస్‌కు చేరుకోగానే భయానికి గురౌతున్నారు.ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకముందే అధికారులు లైట్లు ఏర్పాటు చేయించాలని పలువురు కోరుతున్నారు.

బస్టాండ్ చీకటిగా ఉన్నా పట్టించుకోని అధికారులు

బీటీఎస్ బస్టాండ్ వద్ద రాత్రి కాగానే చీకటిగా ఉంటుంది. గతంలో అక్కడ ఒక కిరాణం దుకాణం ఉండేది. దీంతో రాత్రి 12 గంటల వరకు విద్యుత్ లైట్లు ఉండేవి. అయితే ప్రస్తుతం అక్కడ దుకాణం లేకపోవడంతో చీకటిగా మారింది. అధికారులు స్పందించి బీటిఎస్ బస్టాండ్ వద్ద విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చెరువుల చెంతనే చెత్తా చెదారం

● వ్యర్థ పదార్థాలతో దుర్వాసన ● నిరుపయోగంగా డంపింగ్ యార్డ్ ● అధికారుల నిర్లక్ష్యం



చింతలకుంట చెరువులో డంప్ చెస్తున్న వ్యర్థ పదార్థాలు



చెరువులో వ్యర్థ పదార్థాల దృశ్యం



నిరుపయోగంగా డంపింగ్ యార్డ్

పిట్లం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పల్లెలు పరిశుభ్రంగా ఉండాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం చెత్తా చెదారాలు వ్యర్థ పదార్థాల సేకరణకు లక్షల రూపాయల నిధులు వెచ్చించి డంపింగ్ యార్డ్‌ల నిర్మాణాలు చేపట్టాయి. కాని అవి అధికారుల నిర్లక్షంతో అలంకారణ ప్రాయంగా మారాయి. పిట్లం మేజర్ గ్రామ పంచాయతీ పరిదిలో ప్రతీ నిత్యం టాక్టర్‌ల ద్వారా సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించ కుండా, చెరువులో, కుంటల్లో తరలించి పారవెస్తున్నారు. దీంతో చెరువులు కుంటలు చెత్త చెదారంతో నిండిపోయి డంపింగ్ యార్డ్‌ల తలపిస్తున్నాయి. చెరువులో చెత్త వేయ రాదని హుకుం జారి చేసే అధికారులు ఇలా నిర్లక్షంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

నిరుపయోగంగా డంపింగ్ యార్డ్

రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత ఆశయంతో ఎర్పాటు చెసిన డంపింగ్ యార్డ్‌లు వృథాగా మారాయి. గ్రామపంచాయితీ పరిదిలో ప్రతీ నిత్యం టాక్టర్‌ల ద్వారా సేకరించిన చెత్తను సేంద్రియ ఎరువులు తయారు చెసి పంచాయతీలు ఆదాయం పోందాలనె సదుద్దెశంతో వీటిని ఏర్పా టు చెశారు. కానీ ఆచరణలో అందుకువిరుద్దంగా ఉంది, గ్రామంలోని డంపింగ్‌యార్డ్ వినియోగంలో లేక చెత్త చెదారాన్ని చెరువులలో, రోడ్ల వెంట పడెస్తున్నారు. ఆ చెత్త చెదారంతో ఆయా ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతుందని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు,

చెరువులో వ్యర్థ పదార్థాలతో జీవాలకు ముప్పు..

గ్రామంలోని చెతా చెదారం వ్యర్థపదార్థాలు పిట్లం గ్రామపంచాయితీ పరిధిలోని ఎలిమెలికుంట, చింతలకుంటలో వెయడంతో మూగజీవాలకు ముప్పు వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు.అసలె రానున్నది వర్ష కాలం చెరువు వేసిన చెత్తచెదారం నీటిలో చెరుతాయని, నీరు కలుషితమై మూగజీవాల పాలిట మృత్యుపాశంగా మారాయి. ఈ చెరువులు కుంటల ఆధార పడి అనెక కుటుంబాలు పాడి రంగాన్ని నమ్ముకొని జీవిస్తున్నారు. కుంటల్లోని నీరు గేదెలు తాగి అవస్థకు గురి అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చెస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులో చెత్త చెదారం వెయకుంట కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నీరు కలుషితమై మూగజీవాల అనారోగ్యం

● రంజిత్‌నాయక్, రైతు



చెరువులు, కుంటలపై ఆదారపడి పాడి రంగాన్ని నమ్ముకొని జీవిస్తు న్నాం. కుంటలు, చెరువుల్లో గ్రామ పంచాయతీ అధికారులు గ్రామ చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించకుండా చెత్త చెదారాన్ని తీసుకొచ్చి కుంటలలో వేస్తున్నారు. దీంతో నీరు కలుషితమై మూగజీవాలు అనా రోగ్యానికి గురి అవుతున్నాయి. చెత్తను కుంటలొ వెయకుండ అదికారులు చర్యలు చేపట్టాలి.

సాకారమైన పసుపు రైతుల కల

● జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి



మోర్తాడ్‌లో పల్లె గంగారెడ్డిని సన్మానిస్తున్న యువ రైతులు

మోర్తాడ్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జిల్లాకు పసుపు బోర్డు మంజూరు చేయడం పట్ల పసుపు రైతుల కల నెర వేరిందని పసుపుబోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి తెలిపారు. ఆదివారం మోర్తాడ్‌కు మొదటిసారిగా విచ్చేయడంతో పల్లె గంగారెడ్డిని బీజేపీ నాయకులు, యువ రైతులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆర్మూర్ ప్రాంత రైతులు పాటు జిల్లా రైతులు కూడా పోరాటం చేశారన్నారు. ఇటీవల మృతి చెందిన ముత్యాల మనోహర్‌రెడ్డి పసుపుబోర్డు అయ్యేంత వరకు పాదరక్షలు ధరించనని సుమారు పదేళ్ల పాదరక్షలు లేకుండా నడిచారని గుర్తు చేశారు. అంతేగాకుండా పసుపుబోర్డు కోసం తిరుపతికి కాలినడకన వెళ్లారని, ప్రధాన మంత్రి మోదీ పసుపు బోర్డు ప్రకటించిన తర్వాత మనోహర్‌రెడ్డి పాదరక్షలు ధరించారన్నారు. దురదృష్టవశాత్తు ఆయన ఇటీవలే మరణించడంతో ఆయన అన్నారు. పసుపు బోర్డు వల్ల రైతులకు అనేక లాభాలు కలుగుతాయని ఆయన వివరించారు. ఈ సందర్భంగా పల్లె గంగారెడ్డిని పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల నరేష్, ఆర్గానిక్ ఫార్మర్ సీనియర్ బీజేపీ నాయకులు కె.లక్ష్మీనర్సయ్య పటేల్, జైడి గంగారెడ్డి, ప్రసాద్, తక్కురి లక్ష్మణ్, దేవేందర్, బావల చిన్న నర్సయ్య, బోగ దేవేందర్, పాల్గొన్నారు.

చెరువులో ప్రతిబింబం

ఫొటో న్యూస్

నిజామాబాద్ రూరల్ మండలం మల్కాపూర్ తండా శివారులోని చెరువులో కనిపించిన ప్రతిబింబమే ఈ దృశ్యం. సాధారణంగా మన ప్రతిబింబాన్ని చూసుకోవాలంటే అద్దాన్ని ఆశ్రయిస్తాం. కానీ ప్రకృతి తమ ప్రతిబింబాలను చూసుకోలేదు. అలాంటి ప్రతిబింబం చెరువులో కనిపిస్తే మహా అద్భుతం. ఇలాంటి దృశ్యం రూరల్ మండలం మల్కాపూర్ శివారులో అటువైపుగా వెళ్లే వాహన దారుల చూపును మళ్లిస్తుంది.

● (ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, నిజామాబాద్)







మాట్లాడుతున్న ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్

సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

● ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్

మోపాల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సీనియర్ నాయకుడు సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి కేటాయిస్తే ఉమ్మడి జిల్లా అభివృద్ధి మరింత వేగవంతంగా జరుగనుందని ఐడీసీ ఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, ఎస్టీసెల్ ఆదివాసీ గిరిజన చైర్మన్ యాదగిరి అన్నారు. ఆదివారం బోర్గాం(పి) గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. జిల్లా రాజకీయంగా ఎంతో ఎదిగిందని ఈ జిల్లా నుంచే ఇద్దరు స్పీకర్లు, పీసీసీ అధ్యక్షులుగా ఎన్నికయ్యారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో జిల్లా అభివృద్ధి జరుగుతుందని, ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ ముందుకు పోతున్నారని అన్నారు. గతంలో సుదర్శన్‌రెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు జిల్లా అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని ఆయన హయాంలోనే మెడికల్ కాలేజీ, తెలంగాణ యూనివర్సిటీ, ప్రాణ హిత చేవెళ్ల ప్రాజెక్టుల అభివృద్ధితో పాటు ఎంతో అభివృద్ధి జరిగిందని అన్నారు. సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని ఆదివాసీ గిరిజనులందరూ తీర్మానం ద్వారా ప్రభుత్వ పెద్దలకు, పార్టీ నాయకులకు ఒక ప్రకటనలో కోరడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో మండల మాజీ అధ్యక్షుడు బున్నె రవి, మోపాల్ మండల కాంగ్రెస్ ఎస్టీసెల్ అధ్యక్షుడు రవి, మాజీ సర్పంచ్ గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనానికి నిధులు మంజూరు చేయాలి



ఎంపీ డాక్టర్ లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న మున్నూరుకాపులు

ఇందల్వాయి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మున్నూరుకాపు కమ్యూనిటీ భవనానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఓబీసీ జాతీయ అధ్యక్షుడు ఎంపీ డాక్టర్ లక్ష్మణ్‌కు మున్నూరుకాపు సంఘం సభ్యులు జిల్లా బీజేపీ కార్యాలయంలో ఆదివారం వినతిపత్రాన్ని సమర్పించారు. మున్నూరుకాపులకు మండల కేంద్రంలో కమ్యూనిటీ భవనం లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మున్నూరుకాపుల సమస్యలు తీర్చాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అనంతరం శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్, బీజేపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, మున్నూరుకాపు సంఘం గౌరవ అధ్యక్షుడు పులిసాగర్, గడ్కోల్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సాంబారి విఠల్, క్యాషియర్ గంగాధర్, కార్యదర్శి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆకుల కొండూర్‌లో క్రికెట్ పోటీలు ప్రారంభం



మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మోపాల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ మండలంలోని ఆకుల కొండూర్ గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను పార్టీ నాయకులు ప్రారంభించారు. క్రీడా పోటీలో పాల్గొనేందుకు వివిధ గ్రామాల యువకులు పాల్గొన్నారు. యువకుల్లో క్రీడా స్ఫూర్తిని పెంచేందుకు క్రికెట్ టోర్నమెంట్ పోటీలను నిర్వహించడం జరుగుతుందని మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు పూర్ణచందర్‌రాజు తెలిపారు. క్రికెట్ టోర్నమెంట్‌లో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి బహుమతులను ప్రధానం చేయడం జరుగుతుందని తెలిపారు.

100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఏడీఈ శ్రీనివాస్

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హనుమాన్ నగర్ కాలనీకి ఎస్ఈ రవీందర్, డీఈ ఉత్తమ్‌జాడే 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయడంతో ఏడీఈ శ్రీనివాస్ లైన్‌మెన్ సత్యనారాయణతో కలిసి ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఎట్టకేలకు లోవోల్టేజ్ విద్యుత్ సమస్య పరిష్కారం కావడంతో హనుమాన్‌నగర్ కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

అంజిరెడ్డి గెలుపునకు కృషి చేయాలి

గాంధారి,ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలో బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి గెలుపునకు కృషి చేయాలని ఎల్లారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి హైమారెడ్డి, రాష్ట్రనాయకుడు పైడి ఎల్లారెడ్డి పార్టీ నాయకులకు సూచించారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలాగా ఓటర్లను అభ్యర్థించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మదుసూదన్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు విఠల్, బీజేవైయం జిల్లా ప్రధానకార్యదర్శి ప్రభాకర్, మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్, శ్రీధర్, రాజు, రమేష్, తూర్పుశేఖర్ పాల్గొన్నారు.



గణపతి మూల విగ్రహం



సార్వజనిక్ గణేష్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా గణనాథుడికి పూజలు

● ఆలయాల్లో సంకష్ట చతుర్థి అభిషేకాలు

నిజామాబాద్ కల్చరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): 'మమ్మల్ని చల్లగా చూసి.. సంకటాలను తొలగించు తండ్రి' అని వేడుకుంటూ గణనాథుడికి భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఆదివారం సంకష్ట చతుర్థిని పురస్కరించుకొని ఆలయాల్లో గణనాథునికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. వేదపండితులు వేద మంత్రోచ్చరణలతో స్వామికి సంకష్ట చతుర్థి పూజలు చేశారు. మాఘమాసానికి తోడు సెలవుదినం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పలు ఆలయాల్లో సాయంత్రం సామూహిక సంకష్ట పూజలో భక్తులు పాల్గొని చంద్రోదయంతో ఉపవాస దీక్షను విరమించారు. జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ వినాయక క్షేత్రాలైన సార్వజనిక్ గణేష్ ఆలయం, పద్మనగర్ రోడ్‌లోని సిద్ధివినాయక ఆలయం, బ్రహ్మపురిలోని వర సిద్ధి వినాయక ఆలయం, బోర్గాం(పి)లోని లక్ష్మిగణపతి ఆలయం, న్యూహౌజింగ్ బోర్డు లోని మహాగణపతి ఆలయం, గూపన్‌పల్లిలోని వినాయక ఆలయం, బొడ్డెమ్మ చెరువు వద్ద గల మహాగణపతి ఆలయాల్లో గణనాథునికి పూజలు నిర్వహించారు.

సమగ్ర భూ పంపిణీ ద్వారానే పేదరిక నిర్మూలన

ఖిల్లా, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సమగ్ర భూ పంపిణీ ద్వారానే పేదరిక నిర్మూలన జరుగుతుందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్‌శోభన్ అన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు రెండో రోజు ముఖ్య అతిథిగా ఆయన హాజరై బోధించారు. అనంతరం మాట్లాడుతూ దున్నేవాడికి భూమి కావాలని వెట్టి చాకిరి, కుల మతాలు లేని సమాజం కావాలన్నారు. ఎర్రజెండా నాయకత్వంలో వీర తెలంగాణ విప్లవ సాయుధ రైతాంగ పోరాటం ద్వారా 4000మంది ప్రాణాలర్పించి 3000గ్రామాల్లో 10లక్షల ఎకరాలు పంచిన చరిత్ర కమ్యూనిస్టులదన్నారు. రాష్ట్రంలో లక్షలాది ఎకరాల బంజరు, మిగులు భూములు తిరిగి భూస్వాములు, పలుకుబడి కలిగిన వారు అక్రమంగా, దౌర్జన్యంగా స్వాధీనం చేసుకున్నారన్నారు. పోరాడిన వారిపై అధికార పార్టీలు నిర్బంధం ప్రయోగించి కేసులు బనాయించారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటు చేసిన కోనేరు రంగారావ్ కమిషన్ రాష్ట్రంలో భూమిలేని పేదలకు కనీసం ఎకరం చొప్పున పంచడానికి భూమి ఉందని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. పోరాడితేనే భూమి దక్కుతుందని పేదలను చైతన్యపరిచి భూమి కోసం పోరాడటానికి ప్రజలను సన్నద్ధం చేయాలన్నారు. రాష్ట్రంలో కోనేరు రంగారావ్ కమిటీ సిఫారసులను అమలు చేసి భూమిలేని ప్రతి కుటుంబానికి రెండెకరాల భూమి గ్రామాల్లో ఐదు, పట్టణాల్లో మూడు గజాల ఇంటి స్థలం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ తరగతుల్లో తెలంగాణా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొర్ర సత్యనారయణ, జిల్లా కార్యదర్శి పెద్దివెంకట్రాములు, నాగేశ్వర్‌రావ్, పల్లపు వెంకటేష్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి సిర్పలింగం, నాగుల గోవర్ధన్, నర్రశంకర్, సాయిలు, చంద్రకాంత్,అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర నాయకులు శోభన్



క్రాఫ్ట్ మేళాలో పాల్గొన్న విద్యార్థులు

అబ్బుర పర్చిన క్రాఫ్ట్ మేళా

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఇంటిలో వాడే వేస్టేజ్ పదార్థాల నుంచి బెస్ట్ పదార్థాలను తయారు చేసే విధానాన్ని నగరంలోని వినాయక్‌నగర్‌లోగల అభ్యాస ద స్కూల్ విద్యార్థులు అబ్బుర పరిచేలా ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మేళా నిర్వహించారు. నర్సరీ నుంచి 7వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు తమ సృజనాత్మకతతో వేస్ట్ టూ బెస్ట్ అనే నినాదంతో 900 పరికరాలను తయారు చేశారు. రోజువారి మనం వాడుకునే వస్తువులు, గృహాలంకరణ మరియు పెయింటింగ్స్‌తో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రమోహన్ ప్రారంభించి క్రాఫ్ట్ మేళాను సందర్శించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చెన్న అన్నపూర్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకత నైపుణ్యాలను ఇంకా ఆలోచన శక్తిని పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ ప్రదర్శన ద్వారా అమ్మిన వస్తువుల ద్వారా వచ్చిన డబ్బులను స్వచ్ఛంద సంస్థలకు విరాళంగా ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు శ్రీనివాస్, శ్రీకాంత్, ప్రిన్సిపల్ మాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా అపూర్వ సమ్మేళనం

● 25 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు



పదో తరగతి పూర్వవిద్యార్థులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుద్దులం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2000-2001 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు గ్రామంలోని యూపీఆర్ రీసెర్ట్‌లో అపూర్వ సమ్మేళనం నిర్వహించుకున్నారు. పాఠశాలకు చెందిన 40 మంది విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత ఒకేచోట కలుసుకోవడంతో తమ ఆనందానికి అవధులు లేవు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు అబ్బయ్య, మహేష్‌కుమార్, శ్రీదేవి, రవీందర్‌లకు శాలువాతో సన్మానించారు. కలిసి చదువుకున్న విద్యార్థులు ఆరుగురు విద్యార్థులు రేణుక, సురేష్, గంగరాజం, శ్రవణ్, ప్రవీణ్ ఉపేందర్‌లు వివిధ కారణాలతో చనిపోవడంతో వారికి ముందుగా నివాళులర్పించారు.

నూతన హంగులతో ఆలయ నిర్మాణం

భిక్కనూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా బాసిల్లుతున్న కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలంలోని శ్రీ సిద్ధరామేశ్వర ఆలయం నూతన హంగులతో నిర్మాణమవుతోంది. స్వయంభూవుగా వెలిసిన స్వామివారికి యోగిపుంగవులు రాతికట్టడంతో ఆలయాన్ని నిర్మించగా ఆలయ ప్రాంగణంలో ఒక బావి, ఆలయం వెనక భాగంగా మూలబావి, అమ్మవారి ఆలయంతో పాటుగా మరికొన్ని ఉప ఆలయాలను నిర్మించారు. ఈ ఆలయ నిర్మాణం జరిగినప్పటి నుంచి ఆ ఆలయానికి ఎంతో విశేష ఆదరణ ఉంది. ఈ ఆలయానికి నిత్యం తెలుగు రాష్ట్రాలతో పాటుగా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. ఆలయం చుట్టూ దాతలు, భక్తుల సహకారంతో ఆలయ కమిటీ ప్రతినిధులు, అఖిలపక్షం నాయకులు, ప్రజాప్రతినిధులు రేకుల షెడ్డు, భక్తుల క్యూలైన్లు, అన్నదాన సత్రం, భక్తుల సౌకర్యార్థం గదులు, మరుగుదొడ్లు, ఇతరితర కట్టడాలను నిర్మించారు.

ఆలయంలో ఉడిపి పండితులతో పూజలు

ఆలయాన్ని నూతన హంగులతో పునఃనిర్మించిన సమయంలో ఆలయంలో కొన్నిమార్పులు జరిగాయి. అప్పటివరకు భక్తులతో కిటకిటలాడిన ఆలయం రాను రాను భక్తుల తాకిడి తగ్గుతూ వస్తుంది. దీంతో గత 2022సంవత్సరంలో గ్రామంలోని అన్నికులసంఘాలతో చర్చించి గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఉడిపి పండితులను సంప్రదించారు. దీంతో వారు ఆలయాన్ని సందర్శించి ఆలయంలో వాస్తుదోశాలతో పాటుగా ఆలయానికి అనుసంధానంగా ఉన్న భిక్కనూరు, దోమకొండ పరిధిలోని కొన్ని ఆలయాలు పట్టించుకునేవారు లేక అంతరించి పోయాయని, మరికొని శిథిలావస్థలో ఉన్నాయని ఉడిపి పండితులు గుర్తించారు. దీంతో 2022 సెప్టెంబరులో, 2024లో ఆలయ ప్రాంగణంలో రెండుసార్లు జీర్ణోద్ధరణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. శిథిలావస్థలో ఉన్న భిక్కనూరు చుట్టూ ఉన్న ఆలయాలను శుభ్రం చేసి పూజ కార్యక్రమాలను పునరుద్ధరించారు.



నూతన హంగులతో నిర్మించిన ఆలయం



యోగిపంగవులు నిర్మించిన పాత రాతికట్టడ ఆలయం



ఆలయంలో వాస్తునివారణ పూజలు చేస్తున్న దృశ్యం



స్వామివారి మూలవిరాట్

● మరికొన్ని అభివృద్ధి పనులు చేయాలని భక్తుల వేడుకోలు

ప్రభుత్వాలు ఇదివరకే హామీ ఇచ్చిన విధంగా పర్యా టకకేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటుగా భిక్క నూరు కమాన్ నుంచి ఆలయం వరకు బీటీ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చాలని, 44వ జాతీయరహదారి వద్ద ఆల యానికి వచ్చే రోడ్డుపై ఉన్న బ్రిడ్జిని పెద్దదిగా చేయాలని, ఇటీవల ఆలయం ఎదుట ఉన్న కోనేరును పునరుద్ధరించగా దాని చుట్టూ మరింత అభివృద్ధి చేయాలని, రానున్న శివరాత్రి ఉత్సవాలను, ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి మరింత వైభవంగా నిర్వహిం చాలని మండల ప్రజలు, భక్తులు రాష్ట్రప్రభుత్వాన్ని వేడుకుం టున్నారు.

బోర్లం గురుకుల పాఠశాల ఎదుట
విద్యార్థినుల తల్లిదండ్రుల ధర్నా

బాన్సువాడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం బోర్లం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు ఆదివారం ఆందోళనకు దిగారు. మూడు రోజుల క్రితం పాఠశాలకు చెందిన ఓ విద్యార్థిని కిడ్నాప్ కలకలం కావడంతో విద్యార్థులకు రక్షణ లేకుండాపోతుందని ధర్నా నిర్వహించారు. కొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఇంటికి తీసుకెళ్తామని సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ప్రభుత్వం ఒకవైపు విద్యార్థినుల పట్ల ప్రత్యేక భద్రతతో పాటు రక్షణ కల్పించాలని పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు సిబ్బందిని నియమించారు. అంతేకాకుండా కొన్ని నెలలుగా సీసీ కెమెరాలు పనిచేయక పోవడం రక్షణ లేకపోవడంతో విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ప్రిన్సిపాల్‌తో పాటు సిబ్బంది నిర్లక్ష్యం వల్లనే పాఠశాల గేటు నుంచి తరగతి గది వరకు యువకుడు వచ్చాడంటే ఎంత భద్రత ఉందో ఎంత పర్యవేక్షణ ఉందో ఇట్టే అర్థమవుతుందని తల్లిదండ్రులు ఆరోపించారు. పాఠశాల ఆవరణలోకి గుర్తుతెలియని వ్యక్తి వచ్చి నప్పటికీ అతని పట్టుకోకపోవడంపై ప్రిన్సిపాల్, సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యమే కారణమని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపాల్‌తో పాటు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.



పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థినుల తల్లిదండ్రులు

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.160	రూ.230	రూ. 250

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.88200	రూ.81400	రూ.1000

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : కెప్టెన్ అమెరికా (తెలుగు 3డి) (10.45, 7.20) : లైలా (1.25)
: తండేల్ (4.15, 10.00)
స్క్రీన్-2 :చావా (హిందీ) (10.00, 4.00, 10.25)
: కెప్టెన్ అమెరికా (తెలుగు 3డి) (1.20)
: తండేల్ (7.20)
స్క్రీన్-3 : తండేల్ (10.30)
: నిదిరించు జహాపనా (1.35)
: లైలా (4.10) : చావా (హిందీ) (7.00)
: సనం తేరీ కసమ్ (హిందీ) (10.20)
స్క్రీన్-4 : తాలా (10.55)
: సంక్రాంతికి వస్తున్నాం (1.35, 7.40)
: బ్రహ్మ ఆనందం (4.35) : లైలా (10.40)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : చావా (హిందీ) (11.00, 1.40, 7.30, 10.20)
: తండేల్ (4.30)
స్క్రీన్-2 : లైలా (11.00, 1.40, 7.40, 10.20)
: చావా (హిందీ) (5.00)
స్క్రీన్-3 : బ్రహ్మ ఆనందం (11.00, 4.30)
: కెప్టెన్ అమెరికా (తెలుగు 3డి) (1.45)
: తండేల్ (7.30, 10.20)



దేవి : లైలా (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : చావా (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : సంక్రాంతికి వస్తున్నాం (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : తండేల్ (11.30, 2.30, 6.30, 9.30)

- నిజామాబాద్ అర్బన్